

భార్య ఒడిలోనే శాశ్వత నిద్ర
బత్తలపల్లి ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున ఆకస్మికంగా మృతి చెందారు. గుండెనొప్పితో భార్య ఒడిలోనే తుదిశ్వాస విడిచారు. 8లో



టన్ను చీనీ రూ.10 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.31 వేలు పలికాయి.

గరిష్టం/కనిష్టం 35.3°/21.1°
జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 12 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ప్రైవేటు స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా



సమావేశంలో పాల్గొన్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: లింగ నిర్ధారణ పరీక్షలు నిరోధించడానికి ప్రైవేటు స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ ఆదేశించారు. మంగళవారం ఆమె తన కార్యాలయంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సునీల్ కుమార్, 'దిశ' సీఐ విజయలక్ష్మితో కలిసి వైద్య, ఆరోగ్య శాఖ, పోలీస్ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ... లింగ నిర్ధారణ నేరమన్నారు. కానీ జిల్లాలోని కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లపై ఆరోపణలు వస్తున్నాయని, సంబంధిత అధికారులు నిఘా ఉంచాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో లింగ నిష్పత్తిని పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. లింగ నిర్ధారణ చట్టంపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డెమో అధికారి బాబా ఫక్రుద్దీన్, రెడ్ క్రాస్ సొసైటీ మేనేజర్, విశ్రాంత ఆర్డీఓ శ్రీనివాసులు, మిత్రాజీ ఫౌండేషన్ సెక్రెటరీ సవిత రంగరాజన్, హెచ్ఈ రామలక్ష్మి, అజీజ్ పాల్గొన్నారు.

కేన్సర్‌పై విస్తృత అగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డాక్టర్ కేసీకే నాయక్

హిందూపురం టౌన్: ప్రజలకు కేన్సర్‌పై విస్తృత అవగాహన కల్పించి వ్యాధి బారిన పడకుండా చూడాలని జిల్లా ఆరోగ్య కార్యక్రమాల పర్యవేక్షణ అధికారి డాక్టర్ కేసీకే నాయక్ ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలకు సూచించారు. మంగళవారం ఆయన స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో జరుగుతున్న కేన్సర్ స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కేన్సర్ బారి నుంచి ప్రజలను కాపాడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేకంగా వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందికి శిక్షణను అందిస్తోందన్నారు. శిక్షణలో తెలుసుకున్న విషయాలు ప్రజలకు వివరించి వారు వ్యాధిని బారిన పడకుండా చూడాలన్నారు. తొలిదశలోనే కేన్సర్ గుర్తించడం వల్ల బాధితులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

బెదిరించినందుకు ఏడాది జైలు

మడకశిర: ప్రభుత్వ అధికారిని బెదిరించి, విధులకు ఆటంకం కల్గించిన ఓ వ్యక్తికి స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించింది. వివరాల్లోకి వెళితే...మండల పరిధిలోని వైబీ హళ్లి గ్రామానికి చెందిన రామాంజనప్ప గతంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి పెద్దన్నను బెదిరించడంతో పాటు, విధులకు ఆటంకం కల్గించాడు. దీంతో పంచాయతీ కార్యదర్శి పెద్దన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పుడు ఎస్ఐగా ఉన్న రాజేష్ కేసు నమోదు చేశారు. ఈ కేసుపై కోర్టులో విచారణ జరిగింది. రామాంజనప్పపై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ స్థానిక జూనియర్ సివిల్ జడ్జి అశోక్‌కుమార్ మంగళవారం తీర్పు చెప్పారు.

వైఎస్సార్‌సీపీ నేత పొలంలో దుశ్చర్య

- మామిడి మొక్కలను నరికివేసిన దుండగులు



పొలంలో నరికేసిన మామిడి మొక్కలు

కనగానపల్లి: వైఎస్సార్ సీపీ నేతను ఆర్థికంగా దెబ్బతీసేందుకు దుండగులు పన్నాగం పన్నారు. పొలంలోని పచ్చని మామిడి మొక్కలను నరికివేశారు. వివరాల్లోకి వెళితే... కనగానపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి ప్రభాకర్ తన వ్యవసాయ పొలంలో ఏడాది క్రితం 300పైగా మామిడి మొక్కలు నాటాడు. కష్టపడి వ్యవసాయం చేసుకుంటూ మామిడి మొక్కలకు నీరు పోసుకుంటూ సంరక్షించుకున్నాడు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పొలంలోని 32 పచ్చని మామిడి మొక్కలను కొడవలితో నరికివేశారు. మంగళవారం గుర్తించిన రైతు ఈ ఘటనపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భారమైన బడిసంచి!



■ పుట్టపర్తి 4వ వార్డులో ఒకటో తరగతి చదువుతున్న ఓ ప్రైవేటు స్కూల్ విద్యార్థికి టెక్ట్స్ బుక్స్, వర్క్ బుక్స్, నోట్ బుక్స్ కలిపి మొత్తం 36 ఉన్నాయి. దీంతో స్కూల్ బ్యాగ్ బరువు 4 కిలోలపైగా ఉంటోంది. దీనికి తోడు వాటర్ బాటిల్ కూడా తీసుకెళ్లడంతో నాలుగు రోజులకే ఆ చిన్నారికి మెడనొప్పి వచ్చింది. ఆస్పత్రికి తీసుకెళ్లగా.. మెడపై అధిక భారం పడటం కారణంగా అనారోగ్యానికి గురైనట్లు నిర్ధారించారు.

■ ధర్మవరంలోని కేతిరెడ్డి కాలనీలో మూడో తరగతి చదువుతోన్న ఓ ప్రైవేటు స్కూలు విద్యార్థికి మొత్తం 43 పుస్తకాలు ఇచ్చారు. వాటన్నింటినీ రోజూ పాఠశాలకు తీసుకెళ్లి.. ఇంటికి రావడం కారణంగా విద్యార్థికి వెన్ను నొప్పి వచ్చింది. ఆస్పత్రికి తీసుకెళ్లగా.. పది రోజుల విశ్రాంతి అవసరమని చెప్పారు. అంతేకాకుండా విద్యార్థి వయసుకు మించి పుస్తకాల భారం మోయరాదని వైద్యులు సూచించారు.

2,729 జిల్లాలోని పాఠశాలలు
2,51,554 విద్యార్థుల సంఖ్య

- ఏటా పెరుగుతున్న పుస్తకాల సంఖ్య
- లేత భుజాలపై మోయలేని బ్యాగులు
- చిన్నారులు అనారోగ్యం బారిన పడే ప్రమాదం
- నిర్దేశించినవి కొనాల్సిందేనని పాఠశాలల ఒత్తిడి
- ప్రైవేటు స్కూళ్లలో అవసరం లేని పుస్తకాలే ఎక్కువ

సాక్షి, పుట్టపర్తి

లేత భుజాలపై పుస్తకాల భారం విద్యార్థులకు శాపంగా మారుతోంది. ఏటా పైతరగతికి వెళ్తుంటే... పుస్తకాల సంఖ్య కూడా దానికి తగ్గట్టుగానే పెరుగుతోంది. ప్రైవేటు స్కూళ్ల విద్యార్థులు వాటిని మోస్తూ పడే బాధలు అన్నీ ఇన్నీ కావు. బ్యాగు నిండా పుస్తకాలతో నాలుగైదు అంతస్తుల మెట్లు ఎక్కేందుకు నానా తంటాలు పడుతున్నారు. పుస్తకాల భారం తగ్గించాలని 2006లో చట్టం చేసినా అమలుకు నోచుకోలేదు. అవసరమైన వాటి కంటే అనవసరమైన పుస్తకాలే ఎక్కువగా ఇస్తూ ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు అడ్డగోలుగా సొమ్ము చేసుకుంటున్నారు.

అను'మతి'లేని సిలబస్

ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలు విధిగా ప్రభుత్వం ముద్రించిన పాఠ్య పుస్తకాలతోనే పాఠాలు బోధించాలి. స్టేట్, సీబీఎస్ఈ సిలబస్ మినహా మరే ఇతర పాఠ్యాంశాలను బోధించరాదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. కానీ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఐఐటీ కోచింగ్, స్మార్ట్ క్లాసులు, రివిజన్ టెస్టుల పేరుతో సాధారణ పాఠ్య పుస్తకాలతో పాటు ప్రైవేటు ముద్రణ సంస్థల పుస్తకాలను కొనుగోలు చేయాల్సిందిగా తల్లిదండ్రులకు సూచిస్తున్నారు.

అవసరం లేనివే ఎక్కువగా..

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆరు సబ్జెక్టులకు ఆరు పాఠ్య పుస్తకాలు, మరో ఆరు నోటు బుక్స్, కాపీరైట్‌కు సంబంధించి నాలుగు పుస్తకాలు ఉంటాయి. ప్రైవేటు పాఠశాలలు మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ తల్లిదండ్రులపై ఫీజులు, విద్యార్థులపై పుస్తకాల భారం మోపుతున్నాయి. ఒకటో తరగతి చదివే విద్యార్థికి సాధారణంగా 14 పుస్తకాలు ఉండాలి. కానీ 32 నుంచి 34 ఉంటున్నాయి. ప్రింటెడ్ కాపీరైట్, ప్రింటెడ్ కలర్ కంపోజింగ్, హోం, స్కూల్ ఎక్సర్‌సైజ్, రైటింగ్ ఇంప్రూమెంట్, లాంగ్వేజ్ డిక్షనరీ, డ్రాయింగ్ తదితరాలను అదనంగా జోడిస్తున్నారు. దీనివల్ల బడిసంచి బరువు పెరిగి చిన్నారుల వెన్నెముకపై తీవ్రమైన ప్రభావం పడుతోంది. తద్వారా ఎదుగుదల సక్రమంగా జరగకపోయే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు.

వైద్య నిపుణుల సూచనలు

- సాధారణంగా 15 ఏళ్లలోపే శరీరంలో వివిధ మార్పులు చోటు చేసుకుంటాయి. పాఠశాలల వయసులో మోయాల్సిన భారం కంటే అధిక బరువు మోయడం కారణంగా వెన్నెముక ఒకవైపు వంగిపోవడం (స్కోలియోసిస్) వంటి ఇబ్బందులు తలెత్తుతాయి.
- అధిక బరువుతో కూడిన పెద్ద సైజు బ్యాగు కాకుండా పుస్తకాలు సరిపడా తేలికైనవి కొనుగోలు చేయాలి. విద్యార్థి బరువులో పుస్తకాల బరువు 15 శాతానికి మించరాదు. ఉదాహరణకు 20 కిలోల బరువున్న విద్యార్థి మూడు కిలోలకు మించి మోయరాదు.
- ఎక్కువ పుస్తకాలు ఉన్న పక్షంలో ఉపాధ్యాయుల సలహా మేరకు ఏ రోజున అవసరమైన పుస్తకాలను ఆ రోజున తీసుకెళ్లేలా తల్లిదండ్రులు జాగ్రత్త తీసుకోవాలి.
- బ్యాగును రెండు భుజాలపై సమాన బరువుపడే రీతిలో తగిలించుకోవాలి. ఒకవైపు తగిలించుకుంటే భుజం, మెడ నొప్పి వస్తాయి.
- నిత్యం వ్యాయామం చేయడం వల్ల శారీరక ఇబ్బందులు అధిగమించవచ్చు.

ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల పరిస్థితి ఇలా..

తరగతి	బ్యాగు బరువు (కిలోల్లో)
ఒకటి	6
రెండు	7
మూడు	9
నాలుగు	12
ఐదు	14
ఆరు	16
ఏడు	18
ఎనిమిది	25
తొమ్మిది	25
పది	25 కిలోల పైనే..



ఆరోగ్యంపై దెబ్బ పడుతుంది

బరువుగా ఉండే పుస్తకాల బ్యాగును రోజూ మోయడం కారణంగా విద్యార్థులు ఒక వైపునకు వంగిపోయే ప్రమాదం ఉంది. వారం రోజుల క్రితం మా ఆస్పత్రికి పదో తరగతి విద్యార్థి చికిత్స కోసం వచ్చాడు. వెన్నునొప్పి, మెడనొప్పి ఉందని చెప్పగా.. పరీక్షలు చేసిన అనంతరం పుస్తకాల బ్యాగు మోయడం కారణంగానే ఇబ్బంది పడినట్లు తేలింది. విద్యార్థి బరువులో పది శాతం మించి పుస్తకాల భారం ఉండరాదు.
– డాక్టర్ ప్రతాప్, హిందూపురం

తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలి

పిల్లల ఆరోగ్యం విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. పుస్తకాల బ్యాగును పిల్లలపై మోపరాదు. ఆయా పాఠశాలల నిర్వాహకులతో మాట్లాడి.. ఏ రోజు ఏయే పుస్తకాలు అవసరమో.. అవి మాత్రమే పంపించేలా ప్లాన్ చేసుకుంటే మంచిది. రోజూ అన్ని పుస్తకాలనూ తీసుకెళ్లడం ద్వారా బరువు పెరిగి విద్యార్థి ఆరోగ్యం దెబ్బ తింటుందనే విషయం తల్లిదండ్రులు గుర్తుంచుకోవాలి.
– కృష్ణమోహన్‌రెడ్డి, హెచ్ఎం, కల్లుమర్రి పాఠశాల

నిబంధనలు పాటించాల్సిందే



తరగతులకు అనుగుణంగా విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వాలి. వయసుకు మించిన భారం మోపేలా పుస్తకాల సంఖ్య ఉండరాదు. ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడమే నిజమైన విద్య. అది పుస్తకాల వల్ల రాదు. పుస్తకాలు ఎక్కువగా ఉంటే తమ పిల్లలు గొప్పగా చదువుకుంటారనే దృక్పథంలో తల్లిదండ్రులు ఉండరాదు. మోసే పుస్తకాలకు చదివే చదువులకు సంబంధమే ఉండదని గుర్తించాలి.
– యు.మీనాక్షి, డీఈఓ

అడుగంటుతున్న రిజర్వాయర్లు

- పీఏబీఆర్, ఎంపీఆర్‌లలో కనిష్ట స్థాయికి నీటిమట్టం
- ప్రస్తుతం నెలరోజులకు సరిపడా మాత్రమే నీరు
- నీటి విడుదల ఆలస్యమైతే తాగునీటికి తప్పని ఇక్కట్లు

అనంతపురం సెంట్రల్: జిల్లాలో రిజర్వాయర్లు అడుగంటుతున్నాయి. రోజురోజుకూ నీటి మట్టం పడిపోతుండడం గుబులు రేపుతోంది. సకాలంలో తుంగభద్ర జలాశయం నుంచి నీరు విడుదల కాకపోతే తాగునీటి ఇబ్బందులు తప్పవనే ఆందోళన వ్యక్తమవుతోంది.

టీబీ డ్యాంకు ఈ'సారీ'..

ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు తుంగభద్ర జలాశయం నుంచి వచ్చే నీరే ఆధారం. టీబీ డ్యాం నుంచి వచ్చే నీటిలో దాదాపు సగం తాగునీటి అవసరాలకు కేటాయిస్తున్నారు. అయితే గతేడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా నీటి కేటాయింపులు బాగా తగ్గిపోయాయి. ఈ క్రమంలోనే నీటి అవసరాలు పెరగడంతో జిల్లాలోని రిజర్వాయర్లలో నీరు వేగంగా తగ్గిపోయాయి. ఈ ఏడాది ఇప్పటికీ తుంగభద్ర జలాశయానికి ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. ప్రస్తుతం 815 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. భారీ వర్షాలు కురిస్తే తప్ప జలాశయం నిండే పరిస్థితి లేదు. ఫలితంగా హెచ్చెల్సీకి నీటి విడుదల కూడా ఆలస్యమయ్యే అవకాశముంది.

పీఏబీఆర్‌లో 0. 695 టీఎంసీలు మాత్రమే..

ఉమ్మడి జిల్లాలో దాదాపు అన్ని ప్రాంతాలకు పీఏబీఆర్ నుంచే తాగునీటి సరఫరా జరుగుతోంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జిల్లా ప్రజల దాహార్తిని తీర్చడానికి తాగునీటి స్కీములను మంజూరు చేశారు. ఉరవకొండ, గుంతకల్లు, మడకశిర, కళ్యాణదుర్గం, రాయదుర్గం, హిందూపురం వరకూ పీఏబీఆర్ నుంచే తాగునీరు సరఫరా చేస్తున్నారు. అంతేకాకుండా అనంతపురం నగరానికి ప్రత్యేకంగా వైఎస్ రాజశేఖరరెడ్డి తాగునీటి పథకాన్ని ఏర్పాటు చేశారు. ఇవి కాకుండా శ్రీసత్యసాయి, ఉరవకొండ తాగునీటి పథకాలు పీఏబీఆర్ రిజర్వాయర్‌పైనే ఆధారపడ్డాయి. ప్రతి సంవత్సరం దాదాపు 10 టీఎంసీల వరకూ రిజర్వాయర్ ద్వారా సరఫరా చేస్తున్నారు. ఇలాంటి డ్యాంలో ప్రస్తుతం 0. 695 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఈ నీరు నెలన్నర రోజులకు సరిపోతుందని అధికారులు చెబుతున్నారు. వర్షాల రాక, తుంగభద్ర నుంచి హెచ్చెల్సీకి నీటి విడుదల ఆలస్యమైతే ఇబ్బందులు తప్పవంటున్నారు. ఇక.. ధర్మవరం, పుట్టపర్తి ప్రాంతాలకు చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా జరుగుతోంది. ప్రస్తుతం సీబీఆర్‌లో 3.627 టీఎంసీల నీరు ఉంది. దీంతో ఆ ప్రాంతాలకు ఇబ్బంది ఉండకపోవచ్చని భావిస్తున్నారు.

మల్బరీ..మస్తు లాభాలు మరి!

ఏటా అతివృష్టి, అనావృష్టితో సంప్రదాయ పంటలు నష్టాలు మిగల్చగా..ఆ గ్రామ రైతులు ఆలోచించి మల్బరీ సాగువైపు మళ్లారు. బోర్లలో ఉన్న కొద్దిపాటి నీటిని డ్రిప్ ద్వారా ఉపయోగించుకుంటూ సెరికల్చర్‌తో సిరులు కురిపించుకుంటున్నారు. ఒకరిని చూసి ఒకరు మల్బరీకే మొగ్గు చూపగా..ఇప్పుడా గ్రామంలో ఎక్కడ చూసినా మల్బరీ తోటలే దర్శనమిస్తున్నాయి.

- సిరులు కురిపిస్తున్న సెరికల్చర్
- ఆదర్శంగా నిలుస్తోన్న బీదానిపల్లి
- ఊరు ఊరంతా మల్బరీసాగే
- ఏటా ఆదాయంతో ఆనందంగా ఉన్న రైతులు



బీదానపల్లిలో ఓ రైతు పొలంలో ఏపుగా పెరిగిన మల్బరీ



రేరింగ్ షెడ్డులో పెరుగుతున్న పట్టు పురుగులు

రొద్దం: మండలంలోని మారుమూల గ్రామం బీదానిపల్లి. గ్రామంలో 120 కుటుంబాలుండగా అందరూ వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అందరిలాగే బీదానిపల్లి రైతులు కూడా సంప్రదాయ పంటగా వేరుశనగ సాగుచేసే వారు. ప్రకృతి వైపరీత్యాలతో నష్టాలు చవిచూసేవారు. ఇలా ఏళ్లు గడిచాయి. అయినా రైతు రెక్కల కష్టం ఇంటికి చేరడం లేదు. దీంతో గ్రామంలోని కొందరు రైతులు మల్బరీ సాగుకు చేపట్టారు. తక్కువ పెట్టుబడితో పాటు ప్రభుత్వ ప్రోత్సాహం, కూలీల సమస్య లేకపోవడంతో ఏటా లాభాలు ఆర్జించారు. వారిని చూసి మిగతా వారూ మల్బరీ సాగుకు మొగ్గు చూపారు. ఫలితంగా ప్రస్తుతం ఆ గ్రామంలో 110 కుటుంబాలు మల్బరీ సాగు చేస్తున్నారు.

కొద్దిపాటి నీటిని ఉపయోగించుకుని...

గ్రామంలోని రైతులంతా ఎక్కువగా మల్బరీ పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రతి రైతు ఎకరం, రెండు, మూడు ఎకరాల్లో మల్బరీ తోటలు సాగుచేస్తున్నారు. బోర్లలో నీరు తక్కువగా ఉండటంతో డ్రిప్ ద్వారా మల్బరీ సాగుచేస్తున్నట్లు రైతులు గోపాల్‌రెడ్డి, రామాంజనేయులు, ప్రభాకర్, మిట్టన్న, నాగభూషణప్ప, గంగాధర్, క్రిష్టప్ప, అశ్వర్థప్ప తదితరులు చెబుతున్నారు.

ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం

మల్బరీ సాగుచేస్తున్న బీదానిపల్లి వాసులకు ప్రభుత్వం నుంచి గత ఐదేళ్లుగా మంచి ప్రోత్సాహం లభిస్తోంది. నీటి వసతి కోసం డ్రిప్ అందిస్తోంది. పట్టు శాఖ ద్వారా రైతులకు రేరింగ్ షెడ్లు, రేషం మేపడానికి షెడ్లు నిర్మించి ఇవ్వడంతో రైతులు మల్బరీ సాగులో లాభాలు గడిస్తున్నారు.

ఎకరాకు రూ.60 వేల పైనే ఆదాయం

ఎకరాలో మల్బరీ సాగు చేస్తే రూ.60 వేల పైనే ఆదాయం వస్తోందని రైతులు చెబుతున్నారు. ఎకరా విస్తీర్ణంలో మల్బరీ సాగుకు నాలుగు వేల పుల్లలు అవసరమవుతాయి. ఒక్కో పుల్ల రూ.2 చొప్పున రూ.8 వేలు అవుతుంది. సేద్యం, కూలీలు అన్నీ కలిపి మరో రూ.15 వేలు ఖర్చు వస్తుంది. ఎకరాలో 120 గుడ్లు మేపుతారు. నాలుగు నెలలకు పంట చేతికి అందుతుంది. దాదాపు 1.5 టన్నుల పట్టు గూళ్లు వస్తాయి. మార్కెట్‌లో పట్టుకు ఎంత తక్కువ ధర ఉన్నా...రూ.60 వేలపైనే లాభం వస్తుందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో బైవోల్టిన్ కిలో దాదాపు రూ.490 నుంచి రూ.528 వరకు పలుకుతోంది, అలాగే సీబీ రకం కిలో దాదాపు రూ.450 నుంచి రూ.490 వరకూ ధర పలుకుతోంది. ధరలు ఇలా ఉంటే ఎకరాకు రూ.లక్షపైనే ఆదాయం గడించవచ్చని రైతులు చెబుతున్నారు.



పట్టు గూళ్లు విడిపిస్తున్న మహిళలు

మల్బరీతోనే కుటుంబ పోషణ



మల్బరీ సాగుతోనే మా పిల్లల చదువులు, కుటుంబ పోషణ జరుగుతోంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగబడులు సాధిస్తాం. 450 గుడ్లకు దాదాపు రూ.45 వేల దాకా ఖర్చులు వస్తాయి. బాగా దిగుబడి వస్తే దాదాపు రూ 3.50 లక్షల దాకా ఆదాయం ఉంటుంది. కుటుంబమంతా కలిసి పనిచేస్తే కూలీల సమస్య కూడా ఉండదు.
– ప్రభాకర్, రైతు

గ్రామం మొత్తం మల్బరీనే



మా గ్రామంలో ఎటు చూసినా మల్బరీ తోటలు, రేషం షెడ్లే కనిపిస్తాయి. రైతులు పట్టు పురుగుల పెంపకంలో బిజీగా ఉంటారు. మా కుటుంబాలను కాపాడుతోంది మల్బరీ మాత్రమే. మొత్తం 110 కుటుంబాలు పట్టు పురుగుల పెంపకంలో ఉన్నాయి. నేను ఒక్కో దఫా 120 గుడ్లు మేపుతాను. ఏటా ఆదాయం గడిస్తున్నా.
– రామాంజినమ్మ, మహిళా రైతు

రైతులను ప్రోత్సహిస్తున్నాం

మల్బరీ సాగులో బీదానిపల్లి పేరుగాంచింది. వారానికి ఒకసారి గ్రామానికి వెళ్లి పట్టుపురుగుల పెంపకంపై రైతులకు తగు సూచనలు, సలహాలు ఇస్తున్నాం. మండల వ్యాప్తంగా 1,400 ఎకరాల్లో రైతులు మల్బరీ సాగు చేశారు. సంప్రదాయ పంటల స్థానంలో మల్బరీ సాగు చేసేలా రైతులను ప్రోత్సహిస్తున్నాం.
– సుబ్రహ్మణ్యం, సెరికల్చర్ అధికారి, రొద్దం

ఎన్‌హెచ్ పనులు వేగవంతం చేయాలి

- జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్



పుట్టపర్తి వద్ద జాతీయ రహదారి పనులను పరిశీలిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: జిల్లా పరిధిలో కొనసాగుతున్న జాతీయ రహదారుల (ఎన్‌హెచ్) నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం ఆయన పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖతో కలిసి పుట్టపర్తి, ఎనుములపల్లి, బ్రాహ్మణపల్లి, కప్పలబండ, జగరాజుపల్లి, గ్రామాల వద్ద జరుగుతున్న ఎన్‌హెచ్–342 పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ... జాతీయ రహదారుల కోసం భూమిని కోల్పోయిన రైతులకు పరిహారం ఇచ్చేందుకు వారి వద్ద ఉన్న ఆధారాలు, బ్యాంకు వివరాలు సేకరించాలన్నారు. అలాగే రైతులకు నోటీసులు అందజేయాలన్నారు. అవార్డు ద్వారా లబ్ధిపొందిన రైతు పేరు, సర్వే నంబర్, విస్తీర్ణం తదితర వివరాలతో జాబితా సిద్ధం చేయాలన్నారు. అనంతరం ఆయన.. ఓడీ చెరువు మండలంలో గాజుకుంటపల్లి వద్ద జాతీయ రహదారి 716జీ పనులను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో రైతులతో మాట్లాడారు. రహదారి పనులను సంబంధిత క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. నాణ్యత విషయంలో రాజీ పడవద్దన్నారు.



హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపీ వద్ద మహిళల భారీ క్యూ

జ్వరమొచ్చింది!

సీజనల్ వ్యాధులతో జనం మంచం పడుతున్నారు. జ్వరాలతో ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. మంగళవారం హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రి రోగులతో కిక్కిరిసింది. జ్వరంతోనే దాదాపుగా 1,000 మంది రోగులు ఓపీ తీసుకుని చికిత్స పొంది వెళ్లారు. మరో 140 మంది ఆస్పత్రిలో అడ్మిషన్ అయ్యారు. దీంతో ఆస్పత్రిలోని అన్ని వార్డులు రోగులతో నిండిపోయాయి. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు.
– హిందూపురం టౌన్:



కిక్కిరిసిన చిన్న పిల్లల వార్డు



మందుల కోసం క్యూ కట్టిన దృశ్యం

క్లుప్తంగా

రేకులకుంట శాస్త్రవేత్తల బదిలీ

బుక్కరాయసముద్రం: మండలంలోని రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానంలో పని చేస్తున్న పలువురు శాస్త్రవేత్తలను బదిలీ చేశారు. ప్రధాన శాస్త్రవేత్తడాక్టర్ రాధికను ఏలూరు జిల్లా మాటేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానానికి బదిలీ చేశారు. ఈమె స్థానంలో కర్నూలు జిల్లా బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ నాయక్‌ను నియమించారు. అలాగే డాక్టర్ పవన్‌కుమార్‌రెడ్డిని పార్వతీపురం జిల్లా సీతంపేట మన్యం వ్యవసాయ పరిశోధనా స్థానానికి బదిలీ చేశారు.

తప్పిపోయిన తల్లి కుటుంబ సభ్యుల చెంతకు


తల్లిని కుమారుడు గురుశేఖర్‌కు అప్పగిస్తున్న ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ కుమార్

ధర్మవరం అర్బన్: తప్పిపోయిన తల్లిని కుటుంబ సభ్యుల చెంతకు ధర్మవరం రైల్వే పోలీసులు చేర్చారు. ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ బోయ కుమార్ తెలిపిన మేరకు... అన్నమయ్య జిల్లా తాటిగుంటపాళ్యానికి చెందిన 60 ఏళ్ల రెడ్డమ్మ నాలుగేళ్ల క్రితం ఇంట్లో ఎవరికి చెప్పకుండా రైలు ఎక్కి వెళ్లిపోయింది. ఘటనపై అప్పట్లో ఆమె కుమారుడు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే ఆమె ఫొటోతో కూడిన కరపత్రాలను రైల్వేస్టేషన్లు, బస్టాండ్ ప్రాంతాల్లో అతికించాడు. ఈ నెల 24న తిరుపతి – గుంతకల్లు ప్యాసింజర్ రైలులో తన తల్లి ప్రయాణిస్తున్నట్లు సమాచారం అందుకున్న గురుశేఖర్ వెంటనే రైల్వే పోలీసులను సంప్రదించాడు. రైలు ధర్మవరం స్టేషన్‌కు చేరుకోగానే బోగీలను ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ కుమార్, సిబ్బంది గాలించి రెడ్డమ్మను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విషయాన్ని గురుశేఖర్‌కు తెలపడంతో మంగళవారం ఆయన ధర్మవరానికి చేరుకోవడంతో ఆయనకు రెడ్డమ్మను అప్పగించారు.

వివాహిత ఆత్మహత్య

బ్రహ్మసముద్రం: కడుపు నొప్పి తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... బ్రహ్మసముద్రం మండలం పాబ్బర్లపల్లికి చెందిన హరిజన ఆదిమూర్తికి ఐదేళ్ల క్రితం కర్ణాటక ప్రాంతానికి చెందిన చైత్ర (25)తో వివాహమైంది. అప్పటికే ఆమె కడుపు నొప్పితో బాధపడుతుండేది. దీంతో తల్లిదండ్రులు చిత్రదుర్గలో చికిత్స చేయించారు. అయినా నొప్పి తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న చైత్ర మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న బ్రహ్మసముద్రం ఎస్‌ఐ పరుశురాముడు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

కలెక్టరేట్‌లో జీటీఎస్



- 1922లో ఏర్పాటు చేసిన బ్రిటీష్ ప్రభుత్వం
- స్టాండర్డ్ బెంచ్ మార్క్ 1952గా గుర్తింపు
- దీని ఆధారంగానే జిల్లాలో ఏ సర్వే అయినా..



బ్రిటీష్ ప్రభుత్వ ప్రాజెక్టు

జీటీఎస్ అంటే 'గ్రేట్ ట్రిగ్నామెట్రికల్ సర్వే' అని అర్థం. ఈ పాయింట్‌ను 1922లో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వ సర్వే జనరల్ ఆఫ్ ఇండియా (కలెక్టర్ కార్యాలయం) ఇక్కడ స్థాపించింది. భారత ఉపఖండం అంతటా శాస్త్రీయ కచ్చితత్వంతో కూడిన సర్వే నిర్వహించాలనే లక్ష్యంతో అప్పట్లో బ్రిటీష్ ప్రభుత్వంగ్రేట్ ట్రిగ్నామెట్రికల్ (త్రికోణమితి) సర్వే ఆఫ్ ఇండియా ప్రాజెక్ట్‌ను రూపొందించింది. దీనిని 1802లో ఈస్ట్ ఇండియా కంపెనీ ఆధ్వర్యంలో బ్రిటీష్ పదాతిదళ అధికారి విలియం లాంబ్టన్ ప్రారంభించారు. ఆయన వారసుడు 'జార్జ్ ఎవరెస్ట్ అంద్రూ స్కాట్ వా' నాయకత్వంలో ఈ ప్రాజెక్ట్ సర్వే ఆఫ్ ఇండియాకు బాధ్యత వహించింది. ఎవరెస్ట్ ఆంద్రూ స్కాట్‌వా (1861) తర్వాత ఈ ప్రాజెక్టు జేమ్స్ వాకర్ నేతృత్వం వహించి 1871లో పూర్తి చేయించారు.

అనంతపురం అర్బన్: కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని వెనుక భాగంలో చతురస్రాకారంలో ఉన్న రాతి దిమ్మె దర్శనమిస్తుంది. దాని మీద 'జీటీఎస్ స్టాండర్డ్ బెంచ్ మార్క్ 1952' అనే అక్షరాలు కనిపిస్తాయి. అయితే ఆ రాతి దిమ్మె ఏమిటి.... అక్కడ ఎందుకు ఏర్పాటు చేశారు... దాని మీద ఉన్న అక్షరాలు దేనికి సంకేతం... అనేది దాదాపు ఎవరికీ అంతు చిక్కని ప్రశ్నగానే మిగిలిపోతోంది. చూసిన వారిలో కొందరు తెలుసుకునే ప్రయత్నం చేసినా తెలుసుకోలేకపోయారు.


ఉపయోగం ఏమిటి?

జిల్లాలో ఎయిర్ పోర్టులు, రైల్వే స్టేషన్లు తదితర ప్రభుత్వ కట్టడాలను నిర్మించాల్సి వచ్చినప్పుడు ఆ ప్రదేశం సముద్రమట్టానికి ఎంత ఎత్తులో ఉందనే అంశాన్ని గుర్తించేందుకు సర్వే చేస్తారు. ఇందు కోసం జీటీఎస్ పాయింట్‌ను ఆధారంగా చేసుకుని సర్వే చేస్తారు. జిల్లాలో ఏదేని సర్వే చేయాలన్నా కలెక్టరేట్‌లోని జీటీఎస్ ఆధారంగానే మొదలు పెడుతుంటారు.

త్రికోణాలతో దేశం మొత్తం కలుపుతూ

భారతదేశంలోని బ్రిటీష్ భూభాగాలను గుర్తించడం, హిమాలయాలు, ఎవరెస్ట్, కే1, కాంచనజంగా తదితర పర్వత శ్రేణుల ఎత్తును కొలవడంలో జీటీఎస్ నివేదిక కచ్చితత్వాన్ని కలిగి ఉండడంతో దీనిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశారు. ఇది రేఖాంశ విభాగంలో మొదట కచ్చితమైన కొలతలతో ఒకదానికి, ఐసోస్టాసీ సిద్ధాంతాల అభివృద్ధికి దారితీసిన జియోడెసిక్ అసాధారణ కొలతలతో సరితూగుతోంది. రేఖాంశాల ప్రకారం కన్యాకుమారి నుంచి జమ్మూకాశ్మీర్ వరకూ దేశం మొత్తాన్ని తూర్పు నుంచి పడమరకు... దక్షిణం నుంచి ఉత్తరానికి త్రికోణాలతో కలుపుతూ వచ్చారు. ఈ క్రమంలో త్రికోణ మూలలు కలిసే చోట జీటీఎస్ పాయింట్‌ను ఏర్పాటు చేస్తూ వచ్చారు. కేవలం అనంతపురంలోని కలెక్టరేట్‌లోనే కాకుండా బుక్కరాయసముద్రం కొండ మీద, గుత్తి కోటపై, తదితర ప్రాంతాల్లోనూ ఇలాంటి జీటీఎస్ పాయింట్లు ఉన్నట్లు సమాచారం. కలెక్టరేట్‌లోని జీటీఎస్ పాయింట్‌కు స్టాండర్డ్ బెంచ్ మార్క్ 1952గా గుర్తింపునిచ్చారు.


అనంతపురం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న జీటీఎస్ రాతి దిమ్మె


దేశానికి సంబంధించి గ్రేట్ ట్రిగ్నామెట్రికల్ (త్రికోణమితి) సర్వే మ్యాప్

చాలా ప్రాధాన్యత ఉంది

జీటీఎస్ పాయింట్‌కు చాలా ప్రాధాన్యత ఉంది. ఎంతో వ్యయప్రయాసల కోర్చి దేశం మొత్తాన్ని గ్రేట్ ట్రిగ్నామెట్రికల్ సర్వే అఫ్ ఇండియా త్రికోణమితి సర్వే చేసింది. జిల్లా ఏదేని ప్రధాన నిర్మాణం కోసం సర్వే చేయాల్సి వచ్చినప్పుడు కలెక్టర్ కార్యాలయంలోని జీటీఎస్‌ను ఆధారంగా చేసుకుని సర్వే ప్రారంభిస్తాం.

– రూప్లానాయక్, ఏడీ, సర్వేశాఖ

ఎంజీఎం హెచ్‌ఎం తీరుపై డీఈఓ అసహనం

- విద్యాకానుక బూట్లు మార్కెట్‌లో విక్రయించడంపై విచారణ
- మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపం
- హెచ్‌ఎంకు మెమో జారీ


రికార్డులు పరిశీలిస్తున్న డీఈఓ మీనాక్షి

హిందూపురం టౌన్: స్థానిక ఎంజీఎం పురపాలక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సామ్రాజ్యంపై జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం ఎంజీఎం పాఠశాలను డీఈఓతో పాటు మధ్యాహ్న భోజన జిల్లా అడిషనల్ డైరెక్టర్ రామకృష్ణ తనిఖీ చేశారు. జగనన్న విద్యాకానుక కింద విద్యార్థులకు అందించిన బూట్లను ఈ ఏడాది మార్చి 22న మార్కెట్‌లో అమ్మేసినట్లు ఫిర్యాదులు అందడంతో డీఈఓ విచారణ చేపట్టారు. పాఠశాలలోని రికార్డులు పరిశీలించారు. ప్రాథమిక విచారణలో విద్యార్థులకు పూర్తి స్థాయిలో బూట్లు అందలేదని తేలింది. దీనిపై సమగ్ర విచారణ చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. కాగా హెచ్‌ఎం సామ్రాజ్యంకు మెమో జారీ చేశారు. సకాలంలో సమాధానం ఇవ్వకుంటే చర్యలకు ప్రభుత్వానికి నివేదిక పంపుతామని డీఈఓ అన్నారు. అలాగే మధ్యాహ్న భోజనంలో నాణ్యతను పరిశీలించారు. కోడిగుడ్లు పగిలిపోయి ఉండడం, మెనూ పాటించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భోజన నిర్వాహకుడిని నిలదీయడంతో హెచ్‌ఎం చెప్పిన విధంగానే వంట చేస్తున్నట్లు సమాధానం ఇచ్చాడు. దీనిపై హెచ్‌ఎంను ప్రశ్నించగా తనకు నూతన మెనూ అందలేదని బుకాయించారు. దీంతో అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పాఠశాలలకు కాలక్షేపం కోసం వస్తున్నారా... అంటూ మండిపడ్డారు. హెచ్‌ఎం వ్యవహారశైలిపై ఉపాధ్యాయులతో ఆరా తీశారు. డీఈఓతో పాటు సీఎంఓ అబ్దుల్ మాలిక్ పాల్గొన్నారు.

భార్య ఒడిలోనే శాశ్వత 'నిద్ర'

- బత్తలపల్లి ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున ఆకస్మిక మృతి
- నివాళులర్పించిన జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు చంద్ర
- అండగా ఉంటామని కుటుంబసభ్యులకు భరోసా


మల్లికార్జున (ఫైల్)


మల్లికార్జున మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, తదితరులు

అనంతపురం సిటీ/బత్తలపల్లి: జీవితాంతం తోడుంటాడనుకున్న భర్త.. తన ఒడిలోనే ప్రాణాలొదలడంతో ఆ ఇల్లాలు గుండెలవిసేలా రోదించింది. భర్త శిరస్సును గుండెలకు హత్తుకుని 'దేవుడా! ఎంత పనిచేశావయ్యా...' అంటూ బోరున విలపించింది. అనంతపురంలోని కోవూరు నగర్‌లో మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది.

మళ్లీ రాని లోకానికి మల్లికార్జున

బత్తలపల్లి మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున (51) ఆకస్మికంగా మృతి చెందారు. ఆయనకు భార్యతో పాటు ఓ కుమార్తె ఇద్దరు కుమారులు ఉన్నారు. మూడేళ్ల క్రితం బత్తలపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఆయన అనంతపురంలో నివాసముంటూ రోజూ విధులకు వచ్చిపోయేవారు. గతంలో కదిరి ఎమ్మెల్యే జొన్నా సూర్యనారాయణ, శింగనమల ఎమ్మెల్యే యామినిబాల వద్ద పీఏగా పనిచేశారు. కొన్నిరోజుల పాటు డిప్యూటేషన్‌పై జెడ్పీ పూర్వ సీఈఓ భాస్కరరెడ్డి వద్ద సీసీగానూ ఆయన పనిచేశారు. తర్వాత డిప్యూటేషన్ రద్దు చేసుకుని బత్తలపల్లి కార్యాలయంలో విధులకు హాజరవుతూ వచ్చారు. సోమవారం విధులు ముగించుకున్న అనంతరం ఇంటికి చేరుకున్న ఆయన అదే రోజు రాత్రి అస్వస్థతకు గురైనట్లు బంధువులు తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున వాకింగ్‌కు వెళ్లేందుకు సిద్ధమైన ఆయన గుండె పట్టుకున్నట్లుగా ఉందంటూ భార్యతో చెబుతూ ఆమె ఒడిలోనే తల పెట్టుకుని సేదతీరారు. ఎంతసేపు పిలిచినా స్పందన లేకపోవడంతో కుటుంబసభ్యులు పరిశీలించి, గుండెపోటుతో ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు.

పదోన్నతి సమయంలో...

సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మల్లికార్జున మరో వారంలో పదోన్నతి పొందాల్సి ఉందని జెడ్పీ వర్గాలు తెలిపాయి. ఈ క్రమంలోనే ఆయన గుండెపోటుతో ప్రాణాలొదలడం జెడ్పీ ఉద్యోగులందరినీ కలచివేసింది. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అనంతపురంలోని మల్లికార్జున స్వగృహానికి వెళ్లి ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అందరినీ అన్నా.. అక్కా.. అంటూ ఆప్యాయంగా పలకరించే వాడని గుర్తు చేశారు. నిబద్ధత కలిగిన ఒక ఉద్యోగిని జిల్లా పరిషత్ కోల్పోవడం బాధాకరమన్నారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆమె వెంట అనంతపురం రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, జెడ్పీ ఉద్యోగులు, బత్తలపల్లి ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు. అలాగూ బత్తలపల్లి ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ కోటి సుధ, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కమతం ఈశ్వరయ్య, జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, బీజేపీ నాయకులు కోటి సూర్యప్రకాష్‌బాబు, టీడీపీ మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, బీజేపీ మండల కన్వీనర్ ఆకులేటి వీరనారప్పతో పాటు ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఈఓఆర్డీ దివాకర్, సూపరింటెండెంట్ శ్రీదేవి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

జగన్ సీఎం కాలేదన్న వేదనతో ఇద్దరి మృతి

జగన్ సీఎం కాలేదన్న వేదనతో ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మృతి చెందారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం మనోవేదనతో ఆస్పత్రి పాలైన వారు చికిత్సకు స్పందించక మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.



షఫీ (ఫైల్), మృతుడు పెద్దరంగప్ప

కంబదూరు: మండలంలోని అచ్చంపల్లికి చెందిన షఫీ (51) వైఎస్సార్‌సీపీలో క్రియాశీలక కార్యకర్తగా పనిచేసేవాడు. వైఎస్ జగన్ అంటే వల్లమాలిన అభిమానం ఉన్న ఆయన రెండో సారి తన అభిమాన నేత సీఎం కాలేకపోయాడన్న బాధతో ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి నిద్రాహారాలు మానేశాడు. ఈ క్రమంలో తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు బెంగళూరుకు తీసుకెళ్లారు. అయితే పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి ఆయన మృతి చెందారు. మంగళవారం ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ సభ్యుడు గుద్దెళ్ల నాగరాజు, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు, వైస్ ఎంపీపీ భీమేష్, నాయకులు బాబురెడ్డి, మల్లారెడ్డి, భీమప్ప తదితరులు షఫీ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గోరంట్ల: మండలంలోని గోపిదేవరపల్లికి చెందిన ఆవులపెద్ద రంగప్ప(65)కు వైఎస్ రాజశేఖరరెడ్డి అంటే ఎంతో అభిమానం. అదే అభిమానాన్ని వైఎస్ జగన్‌పై కూడా ఆయన పెంచుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమిని తట్టుకోలేక కుమిలిపోయాడు. నిద్రాహారాలు మానేసి అస్వస్థతకు గురైన ఆయన మంగళవారం తెల్లవారుజామున పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పెనుకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ప్రకటించారు. అలాగే రంగప్ప మృతదేహానికి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక బలవన్మరణం


జెమిని రమేష్ (ఫైల్)

గుంతకల్లు: వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఓ వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లులోని తిలక్‌నగర్‌కు చెందిన వీఎస్‌ఆర్ మూర్తి అలియాస్ జెమిని రమేష్ (49)కు భార్య రమ్యతో పాటు ఇంటర్ చదువుతున్న జైకిషన్, కూతురు అక్షయ ఉన్నారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో జెమిని సెల్ వర్ల్డ్ పేరుతో దుకాణం ఏర్పాటు చేసుకుని సెల్ ఫోన్ల విక్రయంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో వ్యాపారం, ఇతర అవసరాల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేశాడు. సకాలంలో అప్పులు చెల్లించలేకపోవడంతో వడ్డీల భారం పెరిగింది. దీంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక మదనపడుతుండేవాడు. ఈ క్రమంలోనే వడ్డీ వ్యాపారుల నుంచి వేధింపులు ఎక్కువయ్యాయి. తరచూ వడ్డీ వ్యాపారులు దుర్భాషలాడుతుండడంతో తీవ్ర మనస్థాపం చెందిన ఆయన మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బెడ్ రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా ఇంటికి చేరుకున్న రమ్య... ఫ్యాన్‌కు విగతజీవిగా వేలాడుతున్న భర్తను చూసి బోరుమంటూ కేకలు వేసింది. చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని రమేష్‌ను కిందకు దించి వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై గుంతకల్లు రెండో పట్టణ సీఐ గణేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆస్తి కోసమే చంద్రక్క హత్య

- హత్య కేసులో నిందితుల అరెస్ట్

పావగడ: తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని మాచురాజనహళ్లి సమీపంలో ఉన్న నీలగిరి వనంలో గత గురువారం జరిగిన మడకశిర మండలం ఎల్లోటి గ్రామానికి చెందిన వృద్ధురాలు వడ్డె చంద్రక్క హత్య కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. ప్రధాన నిందితులు ఆంజనేయులు, ప్రభాకర్‌ను మంగళవారం అరెస్ట్ చేశారు. వివరాలను సీఐ సురేష్ వెల్లడించారు. ఆస్తి కోసమే చంద్రక్కను దారుణంగా హత్య చేసినట్లుగా దర్యాప్తులో తేలిందన్నారు. చంద్రక్క పేరుతో ఉన్న భూమిని తమ సొంతం చేసుకునేందుకు కుమారుడు ఆంజనేయులు, బంధువు ప్రభాకర్ పథకం ప్రకారం నీలగిరి వనంలో ఒంటరిగా తారసపడిన చంద్రక్క గొంతు కోసి హతమార్చినట్లుగా తెలిపారు. కాగా, హత్య సంజరిగిన రెండవ రోజే నిందితులను అదుపులోకి తీసుకున్న సీఐ సురేష్ నేతృత్వంలోని బృందం... విచారణలో పక్కా ఆధారాలు సేకరించి మంగళవారం అరెస్ట్ చూపారు. అనంతరం న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

ఎన్డీఆర్‌ఎఫ్ బృందం మాక్‌డ్రిల్

పెనుకొండ రూరల్: మండలంలోని గొల్లపల్లి రిజర్వాయర్‌లో మంగళవారం ఎన్డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు నిర్వహించిన మాక్‌డ్రిల్ ఆకట్టుకుంది. విపత్తులు సంభవించినప్పుడు ఎన్డీఆర్‌ఎఫ్ బృందం స్పందించే తీరుపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల సమయంలో ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజలను రక్షిస్తున్న ఎన్డీఆర్‌ఎఫ్ బృందం సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయ్‌శంకర రాజు, సీఐ యుగంధర్, డాక్టర్ నాగరాజునాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఖాద్రీశుని ప్రాకారోత్సవం

కదిరి టౌన్: జేష్ఠ మాసం బహుళ చవితి సందర్భంగా ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి శ్రీవారి ప్రాకారోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. వివిధ పుష్పాలతో అలంకరించిన వెండి రథంపై శ్రీదేవి, భూదేవి సమేత వసంతవల్లభుడి ఉత్సవ మూర్తిని అధిష్ఠింపజేసి మేళతాళాలతో ఊరేగించారు. ఉత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


దేవేరులతో కలసివెండి రథంపై కొలువుదీరిన ఖాద్రీశుడు

ఆరంభంలోనే కరువు ఛాయ



ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే ఉమ్మడి జిల్లాలో కరువు ఛాయలు నెలకొన్నాయి. రోజూ కారు మబ్బులు కనిపిస్తున్నా... వర్షపు చుక్క నేల రాలడం లేదు. ధర్మవరం నియోజకవర్గం సంజీవపురం సమీపంలో వేరుశనగ విత్తుకు సిద్ధం చేసుకున్న పొలాలు వర్షం కోసం ఎదురు చూస్తున్నాయి. బత్తలపల్లి సమీపంలో గ్రాసం కోసం ఒట్టి పొలాల్లో వెంపర్లాడుతున్న జీవాలు చివరకు ఆకలి తట్టుకోలేక దొరికింది తిని పొట్ట నింపుకుంటున్నాయి. మరికొన్ని రోజులు ఇలాగే కొనసాగితే ఈ ఖరీఫ్ కాలం గట్టెక్కడం కష్టమేనని రైతులు పేర్కొంటున్నారు. – సాక్షి ఫొటో గ్రాఫర్, అనంతపురం:


గడ్డి కోసం వెదుకుతున్న జీవాలు


రోజూ ఇలాగే ఊరిస్తున్న మేఘాలు